ప్రజాశక్తి
శనివారం 20 మే 2023 5 విజయనగరం



24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-విజయనగరం

ఈనెల 24నుంచి ఇంటర్ అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డిఆర్ఒ గణపతి రావు తెలిపారు. అందుకు సంబంధించి ఏర్పాట్లపై గురువారం తన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. థియరీ పరీక్షలు ఈ నెల 24 నుండి జూన్ 1 వరకు ఉదయం 9 గంటల నుండి 12 వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుండి 5.30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు జూన్ 5 నుండి 9 వరకు ఉదయం 9 గంటల నుండి 12 వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2 నుండి 5 వరకు జరుగుతాయని తెలిపారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆర్‌టిసి బస్సులను పరీక్షా వేళల్లో విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా నడపాలన్నారు. సమావేశంలో ఆర్‌టిసి, పోలీస్, విద్యాశాఖ, ఆర్ఐఒ, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు కార్యదర్శుల బురిడీ!

- వివిధ పద్దుల కింద రూ.25 లక్షలకు పైగా నిధులు స్వాహా
- కార్యదర్శుల కుటుంబ సభ్యుల పేరుతో విత్‌డ్రా
- గత ఇఒపిఆర్‌డి హస్తం ఉందని ఆరోపణలు
- ముగ్గురు కార్యదర్శులను విచారించాలని సర్పంచ్ డిమాండ్
- అంబాడ పంచాయతీ రికార్డులు సీజ్




అంబాడ వెంకటాపురం పంచాయతీ ఇదే..

మండలంలోని అంబాడ వెంకటాపురం గ్రామ పంచాయతీ నిధులను సర్పంచ్ చుక్క వెంకట్ నాయుడుకు తెలియకుండా ముగ్గురు కార్యదర్శులు బురిడి కొట్టి స్వాహా చేశారు. 14, 15 ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, ఉపాధి హామీ నిధులు స్వాహా చేశారని సర్పంచ్ జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డిఎల్‌పిఒ మోహనరావు ఈనెల 5న విచారణ చేపట్టడం తెలిసిందే.

ప్రజాశక్తి- రేగిడి

2018 - 21 సంవత్సరాలకు మండల ప్రత్యేకాధికారుల పాలనలో జ్యోతిర్మయి, ఇజ్జాడ గోపి, బసవ శ్రీనివాసరావులు ఆ గ్రామానికి కార్యదర్శులుగా పనిచేశారు. పాలక మండలి ఏర్పడిన తర్వాత రికార్డులను అప్పగించాల్సిన పంచాయతీ కార్యదర్శులు నిధులను వారి కుటుంబ సభ్యులు లలిత. బి.మాధవి, ఇజ్జాడ హరీష్‌రావు పేర్లతో వినియోగించుకున్నారని సర్పంచ్ చుక్క వెంకట్ నాయుడు జిల్లా కలెక్టర్, జెడ్‌పి చైర్మన్, డిపిఒలకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు చీపురుపల్లి డిఎల్‌పిఒ రహస్యంగా విచారణ పూర్తి చేశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విచారణ అనంతరం 14,15 ఆర్థిక సంఘం నిధులతోపాటు పాస్ పుస్తకాలు, పలు రికార్డులు సీజ్ చేశారు. వాస్తవంగా 2018-21 ప్రత్యేక పాలనలో నిధులు ఇఒపిఆర్‌డి ప్రభాకర్ రావు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు వెటర్నరీ స్వాతి, తర్వాత వచ్చిన సుమన్ డ్రాయింగ్ అధికారులుగా పనిచేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరించారని సర్పంచ్ ఆరోపిస్తున్నారు. ఆడిట్‌లో ఇవేవీ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరినీ జిల్లా ఉన్నతాధికారులు విచారిస్తే మరికొన్ని లక్షల రూపాయలు బయటి పడే అవకాశాలు ఉన్నాయని సర్పంచ్ వెంకట్ నాయుడు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం ఈ విషయాన్ని సర్పంచ్ వారి అనుచరులతో కలిసి జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కంబాల జోగులు సహకారంతో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జిల్లా కలెక్టర్ డిపిఒకు పూర్తిస్థాయిలో విచారణ జరిపాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరినీ వదలొద్దని ఆదేశించినట్లు తెలిపారు.



కుటుంబ సభ్యుల పేరుతో డ్రా చేసిన నిధులు పత్రాలు

అప్పు చేసి పనులు చేశాను



గ్రామ పంచాయతీకి 2018-21లో ఏడాదిలో వచ్చిన నిధులకు అప్పులు చేసి పనులు చేశాను. ఆ మూడేళ్లలో జ్యోతిర్మయి, గోపి, శ్రీనివాసరావు కార్యదర్శులుగా పనిచేశారు. సాంకేతికంగా కంప్యూటర్ అవగాహన లేకపోవడంతో నన్ను కార్యదర్శులు బురిడి కొట్టి నాకు రావలసిన నిధులు స్వాహా చేశారు. కార్యదర్శుల కుటుంబ సభ్యుల పేర్లతో నిధులు డ్రా చేసుకోవడం ఎంతవరకు సమంజసం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో 8 మంది అధికారులను విచారణ జరిపి నిధులు ఇప్పించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలి.

- చుక్కా వెంకట్ నాయుడు, సర్పంచ్, ఎవి పురం

మేము ఏ తప్పూ చేయలేదు

అంబాడ వెంకటాపురం గ్రామ పంచాయతీలో 2018- 21 ఏడాదిలలో చేసిన పనులకు పద్ధతి ప్రకారం నిధులు డ్రా చేసాం. నిధులు డ్రాలో మేము ఏ తప్పూ చేయలేదు. వాస్తవంగా ప్రత్యేక పాలనలో ముందుగా మేము డబ్బులు పెట్టి పనులు చేయించాం. గ్రామస్తులు పేరుతో బిల్లులు పెడితే ఇస్తారో.. లేదో అన్న భయంతో మాకుటు సభ్యుల పేర్లతో బిల్లులు చేశాం.

- గోపి, కార్యదర్శి, రేగిడి



నాయకులతో మాట్లాడుతున్న టిడిపి అధినేత చంద్రబాబునాయుడు

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

ఉత్తరాంధ్ర నేతలకు చంద్రబాబు పిలుపు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలని టిడిపి నాయకులకు ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. శృంగవరపుకోట పట్టణంలోని శిరికి గ్రీన్ సిటీలో శుక్రవారం చంద్రబాబు ఉత్తరాంధ్ర మూడుజిల్లాల నియోజకవర్గ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం నిరంతరం శ్రమించాలన్నారు. టిడిపి అధికారంలోకి రావాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి చేసిన ఘనత టిడిపి కే దక్కుతుందన్నారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి సైకోపాలనతో ప్రజలు విసుగెత్తి పోయారన్నారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధిని గాలికి వదిలేశారని అన్నారు. విద్యుత్తు ఛార్జీలు, ఇంటి పన్ను, చెత్త పన్ను వేసి సామాన్య ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురి చేశారన్నారు. వైసిపి గత నాలుగేళ్లగా పేదలను అనేక రకాలుగా మోసం చేస్తూ ఇసుక, మైనింగ్, లిక్కర్ లలో అరాచకాలకు పాల్పడుతూ రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిందని అన్నారు.

సమావేశంలో కిమిడి కళా వెంకటరావు, గంటా శ్రీనివాస రావు, కిమిడి నాగార్జున, కోళ్ల లలిత కుమారి, పల్లా శ్రీనివాస రావు, భరత్, కోండ్రు మురళి, కొండపల్లి అప్పల నాయుడు, గుమ్మడి సంధ్యారాణి, బొబ్బిలి చిరంజీవులు, కోరాడ రాజబాబు, గిడ్డి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్‌లో రామ్‌నాయన ప్రతిభ



పతకాలతో రామ్‌నాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రపంచ టెన్నిస్ మాస్టర్స్ ఎం.టి 200 సింగిల్ అండ్ డబుల్స్ ఛాంపియన్ పోటీలలో రామ్‌నాయన ప్రతిభ కనబరిచారు. మాజీమంత్రి సుజయకృష్ణ రంగారావు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన సోదరుడు రామ్‌నాయన. ఈ నెల 13 నుంచి 19 వరకు డార్జిలింగ్ జింఖానా క్లబ్‌లో జరిగిన పోటీల్లో 50 ఏళ్ల విభాగంలో పాల్గొన్న రామ్‌నాయన ప్రథమ స్థానంలో నిలిచారు. తండ్రి ఆర్.వి.జి.కె రంగారావు వద్ద టెన్నిస్‌లో మెలకువలు నేర్చున్నట్లు రామ్‌నాయన చెప్పారు. రామ్‌నాయనను సుజయకృష్ణ రంగారావు, బేబినాయన, పలువురు ప్రముఖులు అభినందించారు.



సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ

సుందరయ్య స్ఫూర్తితో కష్టజీవుల రాజ్యం కోసం ఉద్యమిద్దాం

సిపిఎం జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో కష్టజీవులరాజ్యం కోసం ఉద్యమిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. సుందరయ్య 38వ వర్ధంతి సభ శుక్రవారం ఎల్‌బిజి భవనంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళుర్పించారు. అనంతరం సిపిఎం పతాకావిష్కరణ చేశారు. అనంతరం తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ సుందరయ్య సంపన్న కుటుంబం లో పుట్టి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన ఆస్తిని వదులు కొని దక్షిణ భారత దేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించారని అన్నారు. పిల్లలు కంటే ఎక్కడ ప్రజాసేవకు ఆటంకమవుతుందని పిల్లలను కనకుండా కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న మహత్యాగశీలి సుందరయ్యని కొనియాడారు. 12 సంవత్సరాలు సిపిఎం ఆలిండియా ప్రధాన కార్యదర్శి గా పనిచేసి కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించాడని అన్నారు. నేటివరకు దేశంలో కమ్యూనిస్టు పాలన సాగించిన,సాగిస్తున్న రాష్ట్రాలకు ఆయన వేసిన కమ్యూనిస్టు బీజాలే కీలకమని కొనియాడారు. భూమికోసం, భుక్తికోసం,తెలంగాణ విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం నిర్వహించారన్నారు. ఈ దేశంలో దోపిడీ పోవాలని సోషలిజం రావాలని, కష్టజీవుల రాజ్యస్థాపన కోసం ఆయన పోరాటం చేసారని తెలిపారు. ఆయన కోరుకున్న సోషలిజం కష్టజీవుల రాజ్యం దిశగా అందరూ కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. రామకృష్ణానగర్ లో రెడ్డి శంకరరావు, శాంతమూర్తి, ఎల్‌బిజి నగర్, గురజాడ నగర్, సుందరయ్య కాలనీలో పి.రమణమ్మ, బి.రమణ, బి.శ్రీను,ఆర్.శ్రీను ముచ్చెరువు గట్టుపై ఎ.జగన్మోహన్, ఆర్.ఆనంద్, సిహెచ్ వెంకటేష్ ఆధ్వర్యాన సుందరయ్య వర్ధంతి సభలు జరిగాయి.

వాలంటీర్ల సేవల వల్లే ధైర్యంగా ప్రజల్లోకి

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ● వాలంటీర్లకు సేవామిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాల అందజేత



వాలంటీర్‌కు పురస్కారం అందజేసుస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్‌పి చైర్మన్ మజ్జి, కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

పేదవానికి కష్టం వస్తే వారి కుటుంబ సభ్యుల కన్నా ముందే వాలంటీర్‌కు ఫోన్ చేస్తున్నారని, పేద కుటుంబాలను సొంత మనుషుల్లా భావిస్తూ అలుపెరగని సేవలు అందిస్తున్నారని ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. వాలంటీర్లు అంత గొప్ప సేవలు అందిస్తున్నారు కనుకనే ప్రజా ప్రతినిదులమైన మేము ప్రజల్లో ధైర్యంగా తిరగ గలుగుతున్నామని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో వాలంటీర్లకు సేవామిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలను అందజేశారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన కోలగట్ల మాట్లాడుతూ గడప గడపకు వెళ్ళేటప్పుడు ప్రజలను కలసి సంక్షేమ పథకాలు అన్నీసక్రమంగా అందుతున్నాయా అని అడిగితే వాలంటీర్ అన్నిటిని అందిస్తున్నారని చెప్తున్నారని, ఎక్కడా ఒక్క రూపాయి కూడా లంచం అనే ప్రసక్తే లేదని అన్నారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ వాలంటీర్‌ను సత్కరించడమంటే ప్రతి పేదవానిని సత్కరించడమేనని అన్నారు. కోవిడ్‌లో ప్రాణ భయాన్ని లెక్క చేయకుండా ప్రతి ఇంటికి వెళ్లి సేవలను అందించారని, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య చక్కటి వారధులుగా నిలుస్తు పారదర్శకంగా పథకాలను అందిస్తున్నారని కొనియాడారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్నీ అందేలా పని చేసే వాలంటీర్ల సేవలు చారిత్రాత్మకమని అన్నారు.

పురస్కారాల అందజేత

2023 సంవత్సరానికి 9997 మంది గ్రామ వాలంటీర్లకు, 10 కోట్ల 22లక్షల 90 వేల రూపాయలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వాలంటీర్ల ఖాతాలకు ఎన్‌టిఆర్ జిల్లాలో జరిగిన సభ నుండి బటన్ నొక్కి జమ చేసారు. వీరిలో జిల్లాకు చెందిన సేవా వజ్ర 36 మందికి రూ.10.80లక్షలు, సేవా రత్న కింద 160 మందికి రూ.32లక్షలు, సేవా మిత్ర 9801 మందికి రూ.9.80లక్షలు వారి ఖాతాలకు జమ చేసారు. సమావేశం అనంతరం డిప్యూటీ స్పీకర్ , జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మెగా వాలంటీర్లకు చెక్కును అందజేశారు. పురస్కారాలు పొందిన వారికి శాలువ, సర్టిఫికేట్, మెడల్ ను బహుకరించారు. కార్యక్రమంలో ఎంఎల్‌సిలు డాక్టర్ సురేష్ బాబు, ఇందుకూరి రఘురాజు, ఎమ్మెల్యేలు కంబాల జోగులు, శంబంగి వెంకట చిన్న అప్పల నాయుడు, నగర్ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, పలువురు ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, సర్పంచ్‌లు, సచివాలయ స్పెషల్ అధికారి నిర్మలాదేవి, డిపిఒ శ్రీధర్ రాజ, జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్, జిల్లా కో అర్డినేటర్ అశోక్ , జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఎఎస్‌పిగా బాధ్యతలు స్వీకరిస్తున్న అస్మా ఫర్వీన్

ఎఎస్‌పిగా అస్మా ఫర్వీన్

ప్రజాశక్తి-విజయనగరం

కృష్ణా జిల్లా ఎస్ఇబి అదనపు ఎస్‌పిగా పని చేస్తున్న అస్మా ఫర్వీన్ ను విజయనగరం జిల్లా అదనపు ఎస్‌పి (అడ్మిన్) గా నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సెబ్ అదనపు ఎస్‌పిగా అదనపు బాధ్యతలు నిర్వహించాలని కూడా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో ఎస్ఇబి అదనపు ఎస్‌పిగా కృష్ణా జిల్లా నుండి అటాచ్‌మెంట్‌పై ఆమె పని చేస్తున్నారు. 2012లో పోలీసుశాఖ లో డైరెక్ట్ డిఎస్‌పిగా ఎంపికైన అస్మా ఫర్వీన్ రాజమండ్రి, విజయనగరం పోలీసు శిక్షణ కళాశాలలో డిఎస్‌పి హోదాలో పని చేశారు. అదనపు ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది కృష్ణా, విజయనగరం జిల్లాల్లో ఎస్ఇబి అదనపు ఎస్‌పి విధులు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి మార్చిలోగా ఇళ్లన్నీ పూర్తి కావాలని కలెక్టర్ ఎన్.నాగలక్ష్మి ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం మార్చి 2024 వరకు మాత్రమే గడువు ఇచ్చినందున వచ్చే ఏడాది మార్చితో ఇళ్లనిర్మాణానికి గడువు ముగుస్తుందని, ఈలోగా నిర్మించుకున్న వారికి మాత్రమే బిల్లులు మంజూరవుతాయనే విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని అన్నారు. మండలస్థాయి అధికారులు ఇళ్ల నిర్మాణ లేఅవుట్లను ప్రతి శనివారం హౌసింగ్ డే రోజు సందర్శించి లబ్దిదారుల సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం లబ్దిదారులకు రుణాలు అవసరమైతే డిఆర్‌డిఎ, లేదా మెప్మా ద్వారా అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణంపై ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, గృహనిర్మాణ సంస్థ డిఇ, ఎఇలతో జిల్లా కలెక్టర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇళ్ల నిర్మాణంలో ఒక దశ నుంచి మరో దశకు త్వరగా చేరుకోవడంపై చొరవ చూపాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటికే 29,845 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యిందని, మరో 41 వేల ఇళ్ల నిర్మాణం పూర్తికావలసి ఉందని అన్నారు. హౌసింగ్ కాలనీల్లో విద్యుత్, తాగునీరు, అప్రోచ్ రోడ్‌లు వంటి సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా వున్నామని అన్నారు. గుంకలాం, కొండకరకాం లో ఆప్షన్-3 కింద ప్రైవేటు నిర్మాణ సంస్థ అధికంగా నిర్మాణ పనివారిని సమీకరించి ఇళ్లనిర్మాణం చేపట్టేలా చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, హౌసింగ్ పీడీ రమణమూర్తిలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్సులో హౌసింగ్ పీడీ రమణమూర్తి, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమాశంకర్, మెప్మా పీడీ సుధాకర్, ఇపిడిసిఎల్ ఎస్ఇ నాగేశ్వరరావు, డిఇ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు కోతలు నివారించాలని ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలి



ధర్నా చేస్తున్న సిపిఎం, సిపిఐ, బిఎస్‌పి, రైతుకూలీ సంఘం నాయకులు

అనధికార విద్యుత్తు కోతలు నివారించాలని కోరుతూ శుక్రవారం ఎపిఇపిడిసిఎల్ ఇఇ కార్యాలయం వద్ద సిపిఎం, సిపిఐ, బిఎస్‌పి, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు ఎస్.సాంబయ్య, రైతు కూలీ సంఘం నాయకులు వి.కృష్ణ మాట్లాడుతూ అనధికార విద్యుత్తు కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరోవైపు ఎండల తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని చెప్పారు. కోతలను నివారించి, నిరంతర విద్యుత్తు సరఫరా చేయాలని కోరారు. అనంతరం ఇఇ పి.హరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలు

13 జిల్లాల నుంచి హాజరు కానున్న 800 మంది క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నగరం సన్నద్ధమవుతోంది. రాజీవ్ క్రీడా ప్రాంగణంలో ఈనెల 20, 21 తేదీలలో అండర్ 19 కబడ్డీ పోటీలు, 21 22 తేదీలలో కస్పా హైస్కూల్లో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు జరగనున్నాయి. ఇందుకోసం జిల్లా కబడ్డీ అసోసియేషన్, అండర్ 19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, జిల్లా ఖో ఖో అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో సర్వం సిద్ధమవుతోంది. క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలను కల్పించడంతోపాటు భోజన సౌకర్యాలను సమకూర్చుతున్నారు. రాజీవ్ క్రీడా ప్రాంగణంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, డివిఇఒ సురేష్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 20,21 తేదీలలో రాష్ట్రస్థాయి అండర్ 19 బాల బాలికల కబడ్డీ పోటీలు రాజీవ్ క్రీడ ప్రాంగణం మైదానంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. 21, 22 తేదీలలో స్థానిక కస్పా హైస్కూల్లో అండర్ 19 బాలబాలికల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల నుండి కబడ్డీ పోటీలకు సుమారు 400 మంది, ఖోఖో పోటీలకు 400 మంది హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ళ సూరిబాబు, అండర్ 19 స్కూల్ గేమ్స్ కార్యదర్శి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మామిడి మార్కెటింగ్‌పై జెసి ఆరా

జామి మండలంలో పలు యూనిట్ల తనిఖీ

ప్రజాశక్తి-జామి

జామి మండలంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం పర్యటించారు. మామిడి మార్కెటింగ్‌పై ఆరా తీశారు. మండలంలోని పలు యూనిట్లను ఆయన తనిఖీ చేశారు. ముందుగా అన్నంరాజు పేటలో ఎంపిఎఫ్‌సి గోడౌన్‌ను పరిశీలించారు. లొట్లపల్లిలోని రైతు ఉత్పత్తుల సేకరణ కేంద్రాన్ని సందర్శించారు. మామిడి రైతులతో భేటీ అయ్యారు. మామిడి మార్కెటింగ్‌పై ఆరా తీశారు. ఇక్కడినుంచి ఢిల్లీ, వారణాశి, కలకత్తా, రాయ్‌పూర్ తదితర ప్రాంతాలకు మామిడిని ఎగుమతి చేస్తున్నట్లు రైతులు తెలిపారు. తక్కువ స్థలంలో ఎక్కువ పంట దిగుబడినిచ్చే అధిక సాంద్రత మామిడి మొక్కలను ఇప్పించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తిని పరిశీలిస్తామని జెసి హామీ ఇచ్చారు. మామిడి పంటపై దృష్టి పెట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు జెసి సూచించారు. అలమండలో మామిడి తాండ్ర తయారీ యూనిట్లను జెసి పరిశీలించారు. తాండ్ర ఉత్పత్తిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అక్కడి సోలార్ కోల్డ్ స్టోరేజ్‌ను సందర్శించారు. నిల్వ సామర్థ్యంపై ప్రశ్నించారు. జామి మండల కేంద్రంలో పిఎంఎఫ్ఎంఇ పథకం కింద ఏర్పాటు చేసిన ఐస్ క్రీమ్ తయారీ యూనిట్‌ను జెసి సందర్శించారు. ఉత్పత్తి, మార్కెటింగ్ అంశాలను తెలుసుకున్నారు. పిఎంఇజిపి పథకం ద్వారా డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎంబ్రాయిడరీ యూనిట్‌ను పరిశీలించారు. యూనిట్ పనితీరు, ఆదాయ వ్యయాలపై జెసి ఆరా తీశారు. పర్యటనలో ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎవిఎస్‌వి జమదగ్ని, మార్కెటింగ్ ఎడి శ్యామ్‌కుమార్, ఉద్యాన అధికారి టి.అనిత, తహశీల్దార్ హేమంత్‌కుమార్, వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మామిడికాయలను పరిశీలిస్తున్న జెసి మయూర్ అశోక్

సుందరయ్య జీవితం స్ఫూర్తిదాయకం

సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి



సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, ప్రజాశక్తి సిబ్బంది

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాత, తెలంగాణసాయుధ పోరాట యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య ఓ విజ్ఞాన ఘని అని, ఆయన జీవితం పోరాడే శక్తులకు స్ఫూర్తిదాయకమని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ప్రజాశక్తి సాహితీసంస్థ ఆధ్వర్యాన శుక్రవారం జెడ్‌పి మినిస్టీరియల్ భవనంలో సుందరయ్య వర్ధంతి సభ జరిగింది. ముందుగా సుందరయ్య చిత్రపటానికి కృష్ణమూర్తి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సబ్ ఎడిటర్ కె.కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గొప్ప వ్యక్తుల జీవితాలను అధ్యయనం చేయడం ద్వారా మన వ్యక్తిత్వాన్ని సరిచేసి కునేందుకు అవకాశం ఉంటుందన్నారు. భూస్వామ్య కుటుంబం నుంచి వచ్చిన సుందరయ్య చిన్ననాడే కులాల మధ్య వ్యత్యాసాలను గుర్తించి, కుల వివక్షకు,సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. మార్క్సిజం సిద్ధాంతాన్ని అవపోసాన పట్టి దేశ పరిస్థితులకు అన్వయించిన వ్యక్తి అన్నారు. అపారమైన విజ్ఞానం కలిగిన వ్యక్తిగా పార్లమెంట్ లో ఆయన ప్రసంగం కోసం ఎదురుచూసిన పరిస్థితి ఆ నాడు ఉండేదన్నారు. పేదలకు వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో తన తమ్ముడిని వైద్యుడిగా చదివించి నెల్లూరులో ప్రజావైద్యశాల ద్వారా సేవలు అందించారన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో ప్రజలకు అందించిన సేవలు స్ఫూర్తిదాయకం అన్నారు. ఆయన క్రమశిక్షణ, నిరాడంబరతో ఎంతోమందికి ఆదర్శనమని, అందుకే ఆయనను కమ్యూనిస్టు గాంధీ అని అంటారని అన్నారు. ఆంధ్ర మహాసభ ద్వారా సంఘాన్ని నిర్మించి తెలంగాణలో భూ స్వాములకు, నవాబులు కు వ్యతిరేకంగా తెలంగాణా సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారన్నారు. మెరుగైన సమాజం కోసం దారి చూపిన ఆయన జీవితం అందరికీ అనుచరణీయమని అన్నారు. ఆ దిశగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

రామభద్రపురం : కొండకెంగువ గ్రామంలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకర్రావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బలస శ్రీను, గ్రామ నాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.


బాడంగి : పూడివలసలో సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు కృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు.



శృంగవరపుకోట.. సుందరయ్య ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్మికులు

గజపతినగరం : బంగారంపేట గ్రామంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణ, ఈశ్వరరావు, సత్యం, రాము, అచ్చయ్యమ్మ, లక్ష్మి, సన్యాసమ్మ పాల్గొన్నారు.

కొత్తవలస : మండలంలోని పాతసుంకరపాలెం, ఎర్రవానిపాలెం, కొత్తవలస గ్రామాల్లో సుందరయ్య వరంతిని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



బొబ్బిలిలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

బొబ్బిలి : పట్టణంలోఇన రెడ్డికవీధిలో సిపిఎం శాఖా కార్యదర్శి ఎస్.సింహాద్రి ఆధ్వర్యాన సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకర్రావు ఈ కార్యక్రమంలో నాయకులు చుక్క గౌరీ శంకర్రావు, ఎస్.సరస్వతి పాల్గొన్నారు. యుటిఎఫ్ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ నేటి రాజకీయ ప్రతినిధులు సుందరయ్య రాజకీయ చరిత్రను తెలుసుకోవాలన్నారు. విలువలు ఏవిధంగా పెంపొందించబడతాయో ఆయన చరిత్ర నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి కేశవరావు, నాయకులు స్వామినాయుడు, శ్రీనివాస్, ఆనెం శ్రీను, కె.రామకృష్ణ, వేణు, మన్యం జిల్లా నాయకులు మధుసూదనరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలోని కొత్తూరులో సుందరయ్య వర్ధంతిని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జె.గౌరీష్, సిహెచ్.ముత్యాలు, ఎం.శివ, జి.సత్యనారాయణ, ఎం.అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.







గజపతినగరం, కొత్తవలస, రామభద్రపురంలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు, కార్మికులు



విచారణ చేపడుతున్న ఎస్‌డిసి సుదర్శనదొర

స్పందన ఫిర్యాదుపై విచారణ

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని నరవలో ఎంజి కాలనీలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని నరవ సన్యాసిరావు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదుచేశారు. దీంతో శుక్రవారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శనదొర విచారణ చేపట్టారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసన్న రాఘవ, ఆర్‌ఐ, విఆర్‌ఒ పాల్గొన్నారు.



వినతి అందిస్తున్న రైతుసంఘం నాయకులు జగన్, రైతులు

గోకులాల బిల్లులు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-వేపాడ

గోకులం పథకంలో రైతులు నిర్మించుకున్న పశువుల షెడ్లకు బిల్లులు చెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ జగన్ ఆధ్వర్యాన శుక్రవారం ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్‌కు వినతి అందించారు. గోకులాలు నిర్మించి నాలుగేళ్లు పూర్తి కావస్తున్నా బిల్లులు చెల్లించకపోవడం రైతులు అన్యాయం చేయడమేనన్నారు. కార్యక్రమంలో రైతులు అప్పలనాయుడు, ముమ్ములూరి సాయి, గొల్లు చంద్రరావు, కిలపర్తి సత్తిబాబు, జి.ఎర్రన్న , రొంగళి రామారావు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-గజపతినగరం

మధుపాడ, మరుపల్లి పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో చేపట్టిన నాడు-నేడు పనులను శుక్రవారం ఎంపిడిఒ పి.సుదర్శన్, ఎంఇఒ విమలమ్మ పరిశీలించారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తయ్యేటట్టు చూడాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేశారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఆదర్శ పాఠశాలలో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ ఆర్.ఈశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి గ్రూపుల్లో చేరేందుకు జూన్ ఏడో తేదిలోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

ధర్మపురిలో గడపగడపకు...

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 30వ డివిజన్ ధర్మపురి బిసి కాలనీలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల అమలు తీరును వివరిస్తూనే లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. స్థానిక సమస్యల పైన ఆరా తీశారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అన్ని వర్గాలకు సమన్యాయం చేకూర్చే విధంగా ఆర్థిక బలోపేతానికి ముఖ్యమంత్రి తోడ్పాటు ఇస్తున్నారని అన్నారు. కార్పొరేటర్ పతివాడ గణపతి రావు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్చార్జిలు మారెం బాల బ్రహ్మారెడ్డి, బొద్దాన అప్పారావు, డివిజన్ ఇంచార్జ్ పూసర్ల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు చందక ఆదిలక్ష్మి, యువజన అధ్యక్షుడు జయరాం తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం 9,16 సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలన్నారు. ప్రజలకు సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వి.వనజకుమారి, వైసిపి నాయకులు వి.మనోజ్ కుమార్, సిహెచ్ రాజగోపాల్, మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పని చేస్తే కూలి గిట్టుబాటు

ప్రజాశక్తి-రేగిడి

ఉపాధి హామీ పథకంలో వేతనదారులు టెక్నికల్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ అన్నారు. శుక్రవారం గుల్లపాడు పంచాయతీ పరిధి వండానపేట గ్రామంలో ఉపాధి హామీ పథకం, మట్టి రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదారులు రెండు పూటలు పనిచేయాలని సూచించారు. కొలతలు ప్రకారం వేతన దారులు పనిచేస్తే రూ.272 కూలి గిట్టుబాటు అవుతుందని చెప్పారు. ఎండలు తీవ్రతగా ఉన్నాయని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈయనతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్ మంగమ్మ, మేట్లు వేతనదారులు ఉన్నారు.

గొడుగులు, పాదరక్షలు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక షిరిడి సాయిబాబా మందిరం వద్ద శుక్రవారం నైటింగేల్ క్లబ్ సభ్యులు.. యాచకులకు గొడుగులు, పాదరక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నైటింగేల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తూముల అచ్యుతవల్లి మాట్లాడుతూ ఎండలు అధికంగా ఉండటంతో రక్షణ కోసం గొడుగులు, పాదరక్షలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంగీత శిక్షణ

ప్రజాశక్తి-లక్కవరపుకోట

లక్కవరపుకోట శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు సంగీత శిక్షకులు శ్రుతి సంగీతం నేర్పించారు. యోగ వల్లిక ఆధ్వర్యంలో పేపర్ క్రాఫ్ట్ నేర్పించారు. విద్యార్థులు క్యారం బోర్డ్, చదరంగం ఆడారు. ఈ కార్యక్రమంలో 45 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రామాలయ ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని కొండవెలగాడలోని మొయిద పేటలో ఉన్న సిద్ది శిరిడి కోదండరామ ఆలయం ప్రథమ వార్షికోత్సవ ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొదటి రోజు వినాయక పూజ, కలస్థాపన, గణపతి హోమంతో పాటు ఋషి ఈవెంట్స్ వారిచే రేలారే రేలా కార్యక్రమం, ఆదివారం శ్రీ సిద్ధి సిరి సాయి హనుమాన్ లక్ష్మణ సీతారాముల ఉత్సవ విగ్రహాలు పంచామృత, అభిషేకాలు జరుపుతారు. సోమవారం ఉదయం కళ్యాణం, మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమాన్ని గ్రామ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు నిర్వహిస్తారు. అనంతరం తిరు వీధుల్లో స్వామి వారిని ఊరేగిస్తారు. భక్తులందరూ, ప్రజలు ఈ మహాత్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఒక ప్రకటనలో కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

సిప్డాతో వికలాంగులకు భరోసా

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిప్డా పథకం ద్వారా, జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో విభిన్న ప్రతిభావంతులకోసం మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. ఈ పథకం కింద జిల్లాలో చేపట్టాల్సిన చర్యలపై జాయింట్ కలెక్టర్ తన ఛాంబర్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ పథకం కింద చేపట్టాల్సిన కార్యక్రమాలను, తీసుకోవాల్సిన చర్యను జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖాధికారి జివిబి జగదీష్ వివరించారు. జెసి మయూర్ అశోక్ మాట్లాడుతూ, సుగమ్య భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా, సిప్డా పథకం ద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, సంస్థల్లో విభిన్న ప్రతిభావంతుల కోసం మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. దీనిద్వారా అన్ని కార్యాలయాలకు ర్యాంపులు, ప్రత్యేక మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అవసరమైన చోట లిఫ్టులను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. అంధులు, వికలాంగులు నడవడానికి అనుకూలమైన ఫ్లోరింగ్, రెయిలింగ్ కూడా ఏర్పాటు చేయవచ్చునని చెప్పారు. జిల్లాలోని 71 ప్రభుత్వ శాఖలతోపాటు తాహశీల్దార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు, ఎంపిడిఒ కార్యాలయాలు, ఆసుపత్రులు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను పరిశీలించి, వారం రోజుల్లోగా పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పనులకు పూర్తిగా కేంద్రప్రభుత్వమే నిధులను మంజూరు చేస్తుందని, నిధులకు కొరత లేదని జెసి స్పష్టం చేశారు. దీనికోసం విశాఖపట్నం నుంచి సాంకేతిక నిపుణులను రప్పించి, సమగ్ర ప్రణాళికను తయారు చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయితీరాజ్ ఎస్ఇ జిఎస్ఆర్ గుప్త, ఆర్అండ్‌బి ఇఇ జివి రమణ, ఎపిఎంఎస్ఐడిసి ఇఇ బిఎన్ ప్రసాద్, సమగ్ర శిక్ష ఇఇ కెజెకె నాయుడు, ఎపిడబ్ల్యుఐడిసి డిఇ వి.వేణుగోపాల్, ఆర్‌టిసి డిఇ టివి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాంలో మూడు పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి- రేగిడి



కాలిపోతున్న ఇళ్లు

మండలంలోని ఉణుకూరు పంచాయతీ పరిధి పోరాంలో శుక్రవారం సాయంత్రం మూడు పూరిల్లు దగ్ధమయ్యాయి. సింగరతి దాలయ్య ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో పక్కనే ఉన్న సింగరతి రాము, సింగరతి దాలయ్యలకు చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. సింగరతి దాలయ్యకు చెందిన పూరిళ్లుతో పాటు జాలరి వలలు, రూ. 3లక్షలు నగదు కాలిపోయాయి. సింగరతి రాము ఇంటిలో నివాసం ఉంటున్న మురాడపు శంకర్ దొరకు చెందిన విలువైన పత్రాలు, ఆధార్ కార్డు, రూ.50వేలు నగదు దగ్ధమయ్యాయి. మరో సింగరతి దాలయ్యకు సంబంధించి నగదు, పత్రాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. పోరెడ్డి విశ్వనాధానికి సంబంధించి ద్విచక్ర వాహనం అక్కడ ఉండడంతో అది పూర్తిగా దగ్ధమైంది. ఆస్తి నష్టం సుమారు రూ.పది లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

స్థానికులు రాజాం ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించగా వారు వచ్చేలోపు పూర్తిగా మూడిళ్లు దగ్ధమయ్యాయి. తహశీల్దార్ కల్యాణ చక్రవర్తి, విఆర్‌ఒ సత్యనారాయణ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కట్టు బట్టలతో రోడ్డున పడ్డ తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

స్వచ్ఛంద రక్తదాన శిబిరాలతో ఉపయోగం

ప్రజాశక్తి- గుర్ల

స్వచ్ఛంద రక్తదాన శిబిరాలతో ఎంతో ఉపయోగం ఉంటుందని ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని ఎస్ఎస్ఆర్‌పేటలో శుక్రవారం మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో బూర్లే పైడినాయుడు జన్మదినాన్ని పురష్కరించుకుని రక్తదాని శిబిరాన్ని నిర్వహించారు. లక్ష్మి బాలాజీ నర్సింగ్ హోమ్‌లో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్త దాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి రక్తదాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు భీసెట్టి బాబ్జీ, లక్ష్మి బాలాజీ నర్సింగ్ హోమ్ వైద్యులు డాక్టర్ విమల్ కుమార్, డాక్టర్ రమణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాతను అభినందిస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

రెజ్లర్ల పోరాటానికి మద్దతు

ప్రజాశక్తి-చీపురుపల్లి



రెజ్లర్ల పోరాటానికి మద్దతు తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

తమపై జరుగుతున్న లైంగిక వేధింపులకు నిరసనగా ఢిల్లీలో రెజ్లర్లు చేస్తున్న పోరాటానికి మద్దతుగా యుటిఎఫ్ మహిళా విభాగం తరుపున గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గొర్లె పద్మావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. రెజ్లర్లపై లైంగిక వేధింపులకు కారకుడైనా ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్‌భూషన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రీడాకారులకు న్యాయం జరిగేవరకు చేసే పోరాటానికి తమ మద్దతు ఉంటుందని తెలిపారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మీసాల అప్పలనాయుడు, జిల్లా గౌరవధ్యక్షులు ఎ.సత్యశ్రీనివాస్, గరివిడి మండల యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, చీపురుపల్లి మండల అధ్యక్షులు బలరాం, జనజాగృతి సభ్యులు ఎం.సుశీల మోహన్, మనవ్యిత సంస్థ సభ్యులు గోవిందరాజులు, కోటేశ్వరరావు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు లక్ష్మునాయుడు, సామాజిక కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు



ఏరియా ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న డిసిహెచ్ఎస్ గౌరీశంకర్

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరం ఏరియా ఆస్పత్రిని శుక్రవారం డిసిహెచ్ఎస్ గౌరీశంకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, అందుతున్న వైద్య సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆస్పత్రి నూతన భవనం నిర్మాణంలో ఉన్న కారణంగా ప్రస్తుతం ఉన్న సిబ్బందికి, ఇతర సామగ్రిని నిల్వ ఉంచేందుకు కావాల్సిన చోటు లేకపోవడాన్ని గుర్తించామన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి, ప్రస్తుతానికి కొన్ని తాత్కాలికమైన ఏర్పాట్లు చేయనున్నామని తెలిపారు. ఆన్‌లైన్ విధానం ద్వారా ఏరియా ఆసుపత్రి వివరాలన్నీ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. అందరూ కచ్చితమైన సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆలస్యమైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్, ఆర్ఎంఒ డాక్టర్ నాయుడు, ఇతర వైద్యులు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువతిపై అత్యాచారం

ప్రజాశక్తి-పాలకొండ

పట్టణంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో యువతిపై అత్యాచారం జరిగిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న గణేష్‌ను తన చెల్లి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చింది. అదే వార్డులో మరో రోగికి సహాయకుడుగా ఉన్న పాలకొండ పట్టణానికి చెందిన వినోద్ మాయమాటలు చెప్పి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ఎస్ కోట- తలారి గ్రామానికి చెందిన అల్లు పార్వతి అనారోగ్య కారణాల వలన ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లు పార్వతి అనారోగ్య కారణాలవల్ల తన ఇంట్లో ఉరేసుకొని మరణించింది. ఆమె తండ్రి మిడతాన అప్పలనాయుడు పోలీసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బాధితురాలికి మొబైల్‌ను అందజేస్తున్న ఎస్‌పి దీపిక

పోగొట్టుకున్న మొబైల్స్ అందజేత

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని వివిధప్రాంతాల్లో పోగొట్టుకున్న 26 మొబైల్‌ఫోన్లను సైబర్‌సెల్ పోలీసులు శోధించి స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు ఎస్‌పి ఎం.దీపిక శుక్రవారం వాటిని బాధితులకు అందజేశారు. పోలీసులు స్పందించిన తీరుపట్ల బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సైబర్‌సెల్ ఎస్ఐ ప్రశాంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.